రికార్డుల మోత

స్మృతి, ప్రతీక శతక గర్జన
దీప్తి స్పిన్ మాయాజాలం
సిరీస్ 3-0తో క్లీన్‌స్వీప్

ఐర్లాండ్‌పై 304 పరుగుల తేడాతో భారత్ భారీ విజయం

రాజ్‌కోట్: కొత్త రికార్డులు నమోదైన రాజ్‌కోట్‌లో భారత మహిళల జట్టు అదరగొట్టింది. స్వదేశంలో ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో ఏకంగా 304 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి పాత రికార్డుల దుమ్ము దులిపింది. అన్ని విభాగాల్లోనూ అదరగొట్టిన టీమ్‌ఇండియా.. సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మంధాన సేన.. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 435 పరుగుల రికార్డు స్కోరు చేసింది. వన్డేలలో భారత్ (పురుషుల, మహిళల)కూ ఇదే అత్యుత్తమ స్కోరు కావడం విశేషం. ఓపెనర్లు ప్రతీక రావల్ (129 బంతుల్లో 154, 20 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (80 బంతుల్లో 135, 12 ఫోర్లు, 7 సిక్సర్లు) శతకాల మోత మోగించగా రిచా ఘోష్ (42 బంతుల్లో 59, 10 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడటంతో ప్రత్యర్థి ఎదుట భారత్ భారీ స్కోరును నిలిపింది. అనంతరం ఛేదనలో ఐర్లాండ్.. 31.4 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో సారా ఫోర్బ్స్ (41) ఫర్వాలేదనిపించగా మిగిలినవారంతా చేతులెత్తేశారు. భారీ శతకం బాదిన ప్రతీకకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులూ లభించాయి.

1 వన్డేలలో 400 పరుగులు చేయడం భారత మహిళా జట్టుకు ఇదే తొలిసారి. అంతర్జాతీయ స్థాయిలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఈ ఘనత సాధించాయి.

ఆది నుంచే దూకుడు మంత్రం

గత కొంతకాలంగా అద్భుత ఫామ్‌లో ఉన్న మంధాన, ఇటీవలే జట్టులోకి వచ్చి నిలకడగా ఆడుతున్న ప్రతీక ప్రారంభ ఓవర్ల నుంచే ఐర్లాండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ప్రెండర్‌గస్ట్ 3వ ఓవర్లోనే ప్రతీక 3 బౌండరీలు బాది తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పింది. మ్యాచ్ ఆసాంతం ఆమె అదే జోరును కొనసాగించింది. అర్లెనె 9వ ఓవర్లో స్మృతి.. 6, 6, 4 బాదడంతో స్కోరువేగం మరింత పుంజుకుంది. ఈ క్రమంలో ఆమె 31 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేసుకుంది. 17వ ఓవర్లో బౌండరీతో 52 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేశాక ప్రతీక మరింత జోరు పెంచింది. బౌండరీలు, సిక్సర్లతో చెలరేగిన మంధాన.. 70 బంతుల్లోనే తన పదో శతకాన్ని సాధించింది. భారత్ (మహిళల) తరఫున వన్డేలలో ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ. ఈ ఇద్దరి దూకుడుతో 24 ఓవర్లకే భారత్.. వికెట్ నష్టపోకుండా 202 పరుగులు చేసింది. సెంచరీ తర్వాత మరింత వేగంగా ఆడే క్రమంలో మంధాన 27వ ఓవర్లో పెవిలియన్ చేరింది. దీంతో 233 పరుగుల తొలి వికెట్ (26.4 ఓవర్లలోనే) భాగస్వామ్యానికి తెరపడింది.

ప్రతీక మెరుపులు

మంధాన నిష్క్రమించినా ఆమె స్థానంలో వచ్చిన రిచాతో కలిపి ప్రతీక జోరు కొనసాగించింది. ఇదే సిరీస్‌లో శతకం చేసే అవకాశాన్ని కోల్పోయిన ఆమె.. 35వ ఓవర్లో ఐదో బంతిని సింగిల్ తీసి కెరీర్‌లో తొలిసారి మూడంకెల స్కోరును సాధించింది. ఆ తర్వాత ఆమె ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. రిచా సైతం బౌండరీల వర్షం కురిపించడంతో భారత్ స్కోరు రాకెట్ వేగాన్ని తలపించింది. రెండో వికెట్‌కు 104 పరుగులు జోడించిన ఈ జోడీని కెల్లీ 38వ ఓవర్లో విడదీసింది. ఆ తర్వాత కొద్ది సేపటికే ప్రతీక సైతం ఔట్ అయినా తేజల్ (28), హర్లీన్ (15) కలిసి 400 పరుగుల మార్కును దాటించారు.

స్పిన్నర్ల మాయాజాలం

రికార్డు ఛేదనలో ఐర్లాండ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. ఇన్నింగ్స్ మూడో ఓవర్ నుంచి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆ జట్టులో ఐదుగురే రెండంకెల స్కోరు చేశారు. స్పిన్నర్లు దీప్తి శర్మ (3/27), మిన్ను మణి (1/22), తనూజా కన్వర్ (2/31) స్పిన్ మాయాజాలానికి ఐరిష్ బ్యాటర్లు నిలువలేకపోయారు.

వన్డే ఫార్మాట్‌లో టీమ్‌ఇండియాకు (పురుషులు, మహిళలు కలిపి) ఇదే అత్యుత్తమ స్కోరు. పురుషుల జట్టు 2011లో వెస్టిండీస్‌పై 411 పరుగులు చేయడమే ఇప్పటిదాకా హయ్యస్ట్.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 435/5 (ప్రతీక 135, స్మృతి 135, ప్రెండర్‌గస్ట్ 2/71)
ఐర్లాండ్: 31.4 ఓవర్లలో 131 ఆలౌట్ (సారా 41, ప్రెండర్‌గస్ట్ 36, దీప్తి 3/27)

క్వార్టర్స్‌కు భారత జట్లు

ఖోఖో ప్రపంచకప్

ఢిల్లీ: ఖోఖో ప్రపంచకప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు క్వార్టర్స్‌కు దూసుకెళ్లాయి. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 70-38తో పెరూపై విజయఢంకా మోగించింది. ఆడిన మూడు మ్యాచ్‌లలో భారత్‌కు ఇది మూడో విజయం కావడంతో మన జట్టు క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకుంది. మహిళల విభాగంలో భారత్.. 100-16తో ఇరాన్‌ను చిత్తు చేయడంతో క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. తొలి మ్యాచ్‌లో భారత అమ్మాయిలు ఏకంగా 175-18తో దక్షిణ కొరియాను చిత్తుచిత్తుగా ఓడించారు.

సెపక్‌తక్రాలో 'ఆలిండియా పోలీస్'కు పతకాలు

తెలంగాణకు రజతం, కాంస్యం

హనుమకొండ చౌరస్తా, జనవరి 15: హనుమకొండలోని జవహర్ నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్) ఇండోర్ స్టేడియంలో జరిగిన 34వ సీనియర్ నేషనల్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలలో ఆలిండియా పోలీస్ క్రీడాకారుల జట్టు మూడు పతకాలు కొల్లగొట్టింది. ఐదు రోజుల పాటు జరిగిన ఈ క్రీడలు మంగళవారం ముగియగా.. నాలుగు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలలో ఆలిండియా పోలీస్, ఎస్ఎస్‌బీ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. డబుల్ ఈవెంట్‌లో తెలంగాణ మహిళా క్రీడాకారులు వెండి పతకం సాధించగా పురుషుల జట్టు కాంస్యం దక్కించుకుంది.

70 ఏండ్ల వయసులో రామానుజమ్మ సత్తా

రాజన్న సిరిసిల్ల, జనవరి 15 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రానికి చెందిన టమాటం రామానుజమ్మ 70 ఏండ్ల వయసులోనూ సత్తా చాటారు. ప్రపంచ అథ్లెటిక్ పోటీల్లో కాంస్య పతకం సాధించారు. కర్నాటకలోని మంగళూరులో ఈనెల 11 నుంచి 13 దాకా జరిగిన ఒకటవ సౌత్ ఆసియా మాస్టర్ అథ్లెటిక్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలలో భాగంగా.. రామానుజన్మ 800 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్యం గెలిచారు.

ఫైనల్‌కు కర్నాటక

వడోదర: విజయ్ హజారే ట్రోఫీలో కర్నాటక ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన ఈ టోర్నీ తొలి సెమీస్‌లో కర్నాటక.. 5 వికెట్ల తేడాతో హర్యానాను ఓడించింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హర్యానా 50 ఓవర్లలో 237/9 పరుగులు స్కోరు చేసింది. లక్ష్యాన్ని కర్నాటక 47.2 ఓవర్లలోనే ఛేదించింది. దేవ్‌దత్ పడిక్కల్ (86), రవిచంద్రన్ (76) రాణించారు.

భారత షట్లర్ల తడబాటు

ఢిల్లీ: స్వదేశంలో జరుగుతున్న ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలోనూ భారత షట్లర్లు వైఫల్య ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్.. 15-21, 10-21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు. ప్రణయ్‌ను 21-16, 18-21, 18-21తో సు లి యంగ్ (చైనీస్ తైపీ) ఓడించాడు. రజావత్.. 16-21, 22-21, 13-21తో నరకొర (జపాన్)కు తలవంచాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్.. 22-20, 16-21, 11-21తో హాన్ యూ (చైనా) చేతిలో ఓడిపోగా ఆకర్షి కశ్యప్.. 17-21, 13-21తో చోచువాంగ్ (థాయ్‌లాండ్) సైతం ఆమెను అనుసరించింది.

హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా తెలంగాణ

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 15: జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తెలంగాణ బాలుర, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. బాలుర విభాగంలో తెలంగాణ 18-07తో ఆంధ్రప్రదేశ్‌పై గెలవగా బాలికల విభాగంలో.. 12-09తో రాజస్థాన్‌పై విజయం సాధించింది.

జకో జోరు

రికార్డు మ్యాచ్‌లో విజయం
అల్కరాజ్, జ్వెరెవ్ ముందంజ
మూడో రౌండ్‌కు సబలెంక, గాఫ్
రూడ్, జెంగ్ నిష్క్రమణ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో మాజీ చాంపియన్ నొవాక్ జకోవిచ్ జోరు కొనసాగిస్తున్నాడు. జకోతో పాటు కార్లోస్ అల్కరాజ్, అలెగ్జాండర్ జ్వెరెవ్ ముందంజ వేయగా ఆరో సీడ్ కాస్పర్ రూడ్‌కు షాక్ తగిలింది. 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న జకోవిచ్.. రికార్డు మ్యాచ్‌లో గెలిచి ఈ టోర్నీ మూడో రౌండ్‌కు ప్రవేశించాడు. బుధవారం మెల్‌బోర్న్‌లోని రాడ్‌లీవర్ ఎరీనాలో జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జకో..6-1, 6-7 (4/7), 6-3, 6-2తో పోర్చుగల్‌కు చెందిన జెమీ ఫెరియాను చిత్తు చేశాడు. మ్యాచ్‌లో 14 ఏస్‌లు సంధించిన జకో.. 33 విన్నర్లు కొట్టాడు. 33 అనవసర తప్పిదాలు చేసిన సెర్బియా దిగ్గజం.. రెండో సెట్‌ను చేజార్చుకున్నప్పటికీ తర్వాత పుంజుకుని ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. నొవాక్‌కు ఇది 430వ గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ కావడం విశేషం. టెన్నిస్‌లో ఓపెన్ ఎరా ప్రారంభమయ్యాక రోజర్ ఫెదరర్ (429) గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌ల రికార్డును జకో అధిగమించాడు. మిగిలిన మ్యాచ్‌లలో అల్కరాజ్.. 6-0, 6-1, 6-4తో నిషియొక (జపాన్) పై పెద్దగా కష్టపడకుండానే విజయం సాధించాడు. జ్వెరెవ్ (జర్మనీ) 6-1, 6-4, 6-1తో పెడ్రో మార్టిన్ (స్పెయిన్)ను ఓడించాడు. కాస్పర్ రూడ్.. 2-6, 6-3, 1-6, 1-4తో జాకుబ్ మెన్సిక్ (చెక్) చేతిలో నిష్క్రమించి ఇంటిబాట పట్టాడు.

సబలెంక, గాఫ్ ముందుకు..

మహిళల విభాగానికొస్తే హ్యాట్రిక్ టైటిల్ వేటలో ఉన్న ఒకటో సీడ్ అరీనా సబలెంక.. 6-3, 7-5తో జెస్సికా మనీరొ (స్పెయిన్)ను ఓడించి మూడో రౌండ్‌కు చేరుకుంది. అమెరికా అమ్మాయి కోకో గాఫ్ 6-3, 7-5తో జోడీ అన్నా (యూకే)పై అలవోక విజయం సాధించింది. జపాన్ ప్లేయర్ నవొమి ఒసాకా.. 1-6, 6-1, 6-3తో కరోలినా ముచోవా (చెక్)ను ఓడించింది. గత మూడేండ్లలో గ్రాండ్‌స్లామ్ ఈవెంట్ ఆడుతూ మూడో రౌండ్‌కు చేరడం ఒసాకాకు ఇదే తొలిసారి. గత సీజన్ రన్నరప్ అయిన చైనా అమ్మాయి కిన్వెన్ జెంగ్ పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. రెండో రౌండ్‌లో జెంగ్ 6-7 (3/7), 3-6తో లారా సిగ్మండ్ (జర్మనీ) చేతిలో పరాభవం పాలైంది.

వాణిజ్య

ఎగుమతి డీలా

డిసెంబర్‌లో 38 బిలియన్ డాలర్లకే పరిమితం

న్యూఢిల్లీ, జనవరి 15: దేశీయ ఎగుమతులు వరుసగా రెండో నెలా క్షీణించాయి. గత నెల డిసెంబర్‌లో 38.01 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. 2023 డిసెంబర్‌తో పోల్చితే 1 శాతం పడిపోయాయి. మరోవైపు దిగుమతులు దాదాపు 5 శాతం పెరిగి 59.95 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. దీంతో వాణిజ్య లోటు 21.94 బిలియన్ డాలర్లుగా నమోదైంది. కాగా, పెట్రోలియం, రత్నాలు, ఆభరణాలు, రసాయనాల ఎగుమతులు పతనమైపోయాయి. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు గరిష్ఠంగా 28.62 శాతం దిగజారినట్టు బుధవారం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో తేలింది. ఇక నిరుడు ఏప్రిల్-డిసెంబర్ ఎగుమతులు 321.71 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దిగుమతులు 532.48 బిలియన్ డాలర్లు. వాణిజ్య లోటు 210.77 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

దిగుమతికి సుంకం పోటు?

రూపాయి క్షీణతను అడ్డుకొనేందుకు కేంద్రం యోచన

రాబోయే బడ్జెట్‌లో భారీగానే సుంకాల భారం ఉండొచ్చన్న అంచనాలు

న్యూఢిల్లీ, జనవరి 15: రోజురోజుకీ పడిపోతున్న రూపాయి విలువను అడ్డుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం సుంకం ఆయుధాన్ని చేపట్టవచ్చన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయికి పతనమైన విషయం తెలిసిందే. ఈ నెల 13న ఏకంగా 86.70 స్థాయికి దిగజారింది. ఈ ఒక్కరోజే 66 పైసలు క్షీణించింది. దీంతో రాబోయే బడ్జెట్‌లో దేశంలోకి వచ్చే దిగుమతులపై పెద్ద ఎత్తున సుంకాల భారాన్ని మోపవచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త పద్దును ప్రకటించనున్నారు. ఈ సందర్భంగానే డాలర్ల డిమాండ్‌ను అరికట్టడానికి దిగుమతులపై భారీగా సుంకాలను తీసుకురావచ్చని ప్రముఖ ఆర్థికవేత్త డీకే శ్రీవాత్సవ అంటున్నారు. 16వ ఆర్థిక సంఘం సలహా మండలిలో సభ్యుడు కూడా అయిన శ్రీవాత్సవ పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. దిగుమతులపై అధిక సుంకాలను వేయడం వల్ల దిగుమతిదారుల నుంచి డాలర్ల డిమాండ్‌కు కళ్లెం వేయవచ్చని, రూపాయి విలువ పతనాన్నీ నివారించవచ్చని మోదీ సర్కారు యోచిస్తున్నట్టు చెప్పారు.

రూపాయి బలోపేతమే లక్ష్యం

గతకొద్ది రోజులుగా అంతకంతకూ క్షీణిస్తున్న రూపీ ఎక్స్ఛేంజ్ రేటు.. దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగానే పరిణమిస్తున్నది. రూపాయి విలువ పతనం.. ఇటు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలపై, అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విధానాలపైనా ప్రభావం చూపుతుందని శ్రీవాత్సవ చెప్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు రూపాయి బలోపేతమే లక్ష్యంగా సర్కారు, సెంట్రల్ బ్యాంకులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతున్నట్టు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగానే వచ్చే బడ్జెట్‌లో ఆయా దిగుమతులపై సుంకాలను పెంచే వీలుందన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ మున్ముందు ఇంకా పుంజుకుంటుందన్న అంచనాలున్నాయన్న ఆయన.. సమీప భవిష్యత్తులో రూపాయి మరింత బలహీనపడకుండా జాగ్రత్తపడాల్సి ఉందన్నారు.

ట్యాక్స్‌పేయర్స్‌కు ఊరటనివ్వాలి..

కొనుగోలుదారుల వినిమయ శక్తిని పెంపొందించడానికి బడ్జెట్‌లో దిగువశ్రేణి ఐటీ శ్లాబులను సవరించాలని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా చెప్తున్నది. ద్రవ్యోల్బణం అందరి ఆదాయాన్నీ మింగేస్తున్నదని, కాబట్టి పన్ను ఊరట ఇప్పుడు తప్పనిసరిగా అభిప్రాయపడింది. అప్పుడే మార్కెట్‌లోనూ కొత్త ఉత్సాహం వస్తుందన్నది. ఇదిలావుంటే సరసమైన ధరల్లో లభించే హౌజింగ్ ప్రాజెక్టులపై ఆదాయ పన్నును 15 శాతం శ్రేణిలోనే ఉంచాలని క్రెడాయ్ కేంద్రానికి సూచించింది.

వడ్డీరేట్లు తగ్గితేనే వృద్ధి

వచ్చే నెల ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ పావు శాతమైనా రెపోరేటు కోత పెట్టాలి

ఆలస్యమైతే ఆర్థిక వ్యవస్థకు నష్టమే: డ్యూషే బ్యాంక్

ముంబై, జనవరి 15: వచ్చే నెలలో జరిగే ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును పావు శాతమైనా (25 బేసిస్ పాయింట్లు) తగ్గించాల్సిన అవసరం ఉన్నదని డ్యూషే బ్యాంక్ విశ్లేషకులు చెప్తున్నారు. వడ్డీ రేట్ల కోతల్ని ఆలస్యం చేసినకొద్దీ దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టమేనని వారు అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే ఇప్పటికైనా రెపోరేటును తగ్గించకపోతే మున్ముందు జీడీపీ వృద్ధి రేటును మరింతగా త్యాగం చేసినట్టవుతుందని వ్యాఖ్యానించడం గమనార్హం. 'రాబోయే ఫిబ్రవరి, ఏప్రిల్ ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును 0.25 శాతం చొప్పున ఆర్బీఐ తగ్గిస్తుందని మేము భావిస్తున్నాం. ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో రెపోరేటు 6 శాతానికి దిగొస్తుందని ఆశిస్తున్నాం' అన్నారు. వడ్డీరేట్ల కోతలు ప్రభావం చూపాలంటే భారత్‌లో 9 నెలలు పడుతుందని, ఫిబ్రవరి సమీక్షలో కోతలకు శ్రీకారం చుడితే ఆర్బీఐ సరైన నిర్ణయం తీసుకున్నట్టవుతుందని పేర్కొన్నారు.

దాదాపు రెండేండ్లుగా..

'గత ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో వరుసగా గడిచిన 11 ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉన్నాయి. దీంతో దేశ జీడీపీ వృద్ధిరేటు చాలా చాలా క్షీణించింది. దీంతో ఇప్పుడు కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నాయకత్వంలో ఫిబ్రవరిలో జరిగే తొలి ద్రవ్యసమీక్షలోనైనా వడ్డీరేట్లు తగ్గుతాయని అంతా ఎదురుచూస్తున్నారు' అని డ్యూషే బ్యాంక్ అనలిస్టులు చెప్పారు. రెండేండ్లపాటు వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచడం చిన్న విషయమేమీ కాదని తాజా నివేదికలో వ్యాఖ్యానించారు. కాబట్టి రెపోరేటు అరశాతం (50 బేసిస్ పాయింట్లు) తగ్గడం అవసరమన్నారు. గత ఏడాది అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ 1 శాతం మేర వడ్డీరేట్లను తగ్గించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. కాగా, గత నెల డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.22 శాతానికి తగ్గింది. అంతకుముందు నెల నవంబర్‌లో ఇది 5.48 శాతంగా ఉన్నది. ఇక ఈ ఏడాది జనవరి-జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు ఇంకా తగ్గి 4.30 శాతానికి రావచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

రూపీ పతనం దెబ్బ

ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గించడానికి రూపాయి క్షీణత ఇప్పుడు ప్రధాన అడ్డంకిగా మారుతున్నది. సోమవారం దాదాపు రెండేండ్లలో ఎన్నడూలేనంతగా దేశీయ కరెన్సీ పతనమైన విషయం తెలిసిందే. డాలర్‌తో పోల్చితే రూపీ మారకం విలువ ఏకంగా ఆ ఒక్కరోజే 66 పైసలు పడిపోయి 86.70 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలో దిగజారుతున్న రూపాయి విలువ.. దిగుమతుల్ని భారం చేసి దేశంలో ద్రవ్యోల్బణాన్ని ఎగదోసే ప్రమాదం కనిపిస్తున్నది. ఇదే జరిగితే ఆర్బీఐ వడ్డీరేట్ల కోతలకు బ్రేకులు పడ్డట్లేనంటున్నారు. ఇక గత ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధిరేటు 5.4 శాతానికి పరిమితమైంది. ఇది దాదాపు రెండేండ్లలో కనిష్ఠ స్థాయి. ఈ కోణంలో చూస్తే వృద్ధికి ఊతమిచ్చేందుకు వడ్డీరేట్ల కోతలు తప్పనిసరిగా మారుతున్నాయి. మొత్తానికి ఆర్బీఐ ఫిబ్రవరి ద్రవ్యసమీక్షలో ఎలాంటి నిర్ణయం ఉంటుందన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ముఖ్యంగా ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ రంగాల వృద్ధి వడ్డీరేట్లపైనే ఉండటంతో ఆయా రంగాల నుంచి వడ్డీ తగ్గింపుల డిమాండ్ జోరుగా వినిపిస్తున్నది. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపోరేటును ఆర్బీఐ 6.50 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. అప్పట్నుంచి ద్రవ్యోల్బణం అదుపు పేరుతో దాన్ని అక్కడే ఉంచింది. దీంతో ఆయా రుణాలపై ఈఎంఐలు రుణగ్రహీతలకు భారంగా పరిణమించాయి. అయితే గత ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ కఠిన వైఖరిని వీడనాడటం కొంత కలిసొచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. ఫలితంగా రాబోయే సమీక్షల్లో వడ్డీరేట్ల సవరణకు వీలు చిక్కింది.

సెమీకండక్టర్ల పరిశ్రమకు సహకరించండి

కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు వినతి

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): సెమీకండక్టర్ల ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం వైష్ణవ్‌ను ఆయన కలిశారు. తెలంగాణలో సెమీకండక్టర్ల తయారీకి ముందుకొచ్చే పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర అంశాలను వివరించారు. ఈ క్రమంలోనే రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలనూ తెలియజేశారు. పలు ప్రముఖ సంస్థలు తెలంగాణలో తమ డాటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయని, ఇలాంటి తరుణంలో డాటా భద్రత కీలకంగా మారిందన్నారు. అందుకే 'నేషనల్ డిజాస్టర్ రికవరీ జోన్' ఏర్పాటు చేయడం తప్పనిసరని, ఈ అంశంపై దృష్టి సారించాలని కోరారు. కాగా, వచ్చే నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని కేంద్ర మంత్రి వైష్ణవ్‌ను శ్రీధర్ బాబు ఈ భేటీలో ఆహ్వానించారు.

టోకు ధరలు పైపైకి

డిసెంబర్‌లో 2.37 శాతంగా ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ, జనవరి 15: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు విజృంభించాయి. గత నెల డిసెంబర్‌లో 2.37 శాతానికి ఎగబాకాయి. ఆహారేతర, ముఖ్యంగా తయారీ రంగ వస్తూత్పత్తుల రేట్లు పరుగులు పెట్టడమే ఇందుకు ప్రధాన కారణం. ఇంధనం, విద్యుత్తు ప్రియమైనట్టు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన వివరాల్లో తేలింది. నిజానికి 2023 డిసెంబర్‌లో ఇది 0.86 శాతంగానే ఉన్నది. ఇక గత ఏడాది నవంబర్‌లో 1.89 శాతంగా నమోదైంది. కాగా, ఆహార ద్రవ్యోల్బణం 8.47 శాతంగా ఉన్నది. నవంబర్‌లో ఇది 8.63 శాతంగా ఉన్నట్టు వెల్లడైంది. తృణధాన్యాలు, పప్పులు, గోధుమల ధరలు దిగిరావడం కలిసొచ్చింది.

దిగిరాని కూరగాయల రేట్లు

కూరగాయల రేట్లు మాత్రం దిగిరావడం లేదు. హోల్‌సేల్ మార్కెట్‌లో ఆయా వెజిటెబుల్స్ ధరలు కిలో రూ.40-80 వరకు పలుకుతున్నాయి. ఇక రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.120పైనే ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ధరల పెరుగుదల 28.65 శాతంగా ఉన్నది. గత నెల ఆలుగడ్డ రేటు 93.20 శాతం, ఉల్లిగడ్డ ధర 16.81 శాతం చొప్పున పెరిగాయి. నూనె గింజల రేటూ 2.46 శాతం పెరిగింది. నవంబర్‌లో ఇది 0.98 శాతం మేర తగ్గడం గమనార్హం.

ట్రూహోమ్ ఫైనాన్స్‌గా శ్రీరామ్ హౌజింగ్ ఫైనాన్స్

న్యూఢిల్లీ, జనవరి 15: శ్రీరామ్ హౌజింగ్ ఫైనాన్స్.. ట్రూహోమ్ ఫైనాన్స్‌గా మారింది. ఈ మేరకు బుధవారం ఆ సంస్థ ప్రకటించింది. అమెరికాకు చెందిన వార్‌బర్గ్ పిన్‌కస్.. శ్రీరామ్ హౌజింగ్ ఫైనాన్స్‌ను ప్రమోట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వార్‌బర్గ్ పిన్‌కస్, దాని కో-ఇన్వెస్టర్లు (క్యూఐఏ తదితరులు) భాగమైన లావాదేవీ.. ఈ రీబ్రాండింగ్‌కు దారితీసింది. ఇదిలావుంటే ఒప్పందంలో భాగంగా శ్రీరామ్ ఫైనాన్స్ గ్రూప్‌నకు రూ.1,225 కోట్ల పెట్టుబడులు అందాయి.

లాభాల్లో స్టాక్ మార్కెట్లు

224 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై, జనవరి 15: దేశీ